


కాళోజీ జయంతిలో ఎమ్మెల్యే దాసరి

పెద్దపల్లిరూరల్: హైదరాబాద్‌లో జరిగిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.



పల్లెచిత్రాల 'తోట'

పల్లె జీవనం.. పడచుల కట్టుబొట్టు.. భారతీయ సంస్కృతి.. ఆయన చిత్రాలకు మూలాధారం. తోట వైకుంఠం కుంచె పడితే చిత్రాలకు జీవం వచ్చి, కాన్వాస్‌పై నాట్యం చేస్తాయి. 8లో▸

గరిష్టం/కనిష్టం 31.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కాళోజీ ప్రజావాది



కాళోజీ చిత్రపటానికి నాయకుల నివాళి

పెద్దపల్లిరూరల్: ప్రజల కోసం ఉద్యమించిన కాళోజీ నారాయణరావు మహనీయుడని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్, జెడ్పీటీసీ బండారి రామ్మూర్తి అన్నారు. జిల్లా గ్రంథాలయంలో శనివారం కాళోజీ చిత్రపటానికి పూలమాలవేసి ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. హన్మకొండలో కాళోజీ కళాక్షేత్రం నిర్మిస్తున్నారని, వరంగల్ ఆరోగ్య విశ్వవిద్యాలయానికి కాళోజీ పేరు పెట్టారని గుర్తు చేశారు. గ్రంథాలయ సిబ్బంది యూనిస్‌ఖాద్రీ, రాజేందర్, శ్రీనివాస్, మురళి, రాజేశ్, వెంకటేశ్, నరేశ్, అనూష, మానస, జ్యోతి తదితరులున్నారు.

ప్యాసింజర్ రైళ్ల రద్దు పొడిగింపు



రామగుండం: కాజీపేట–బల్లార్షా మధ్య నడిచే ప్యాసింజర్ రైళ్ల రద్దును ఈనెల 27 వరకు పొడిగించినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు పేర్కొన్నారు. రామగిరి, సింగరేణి, కరీంనగర్ పుష్‌పుల్ ఇరువైపులా రాకపోకలు రద్దు చేశారు. సాంకేతికకారణాలతో రద్దును పొడిగిస్తుండడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

అంగన్‌వాడీల ధర్నా



ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

మంథని: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ అంగన్‌వాడీ టీచర్లు శనివారం మంథని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నాకు దిగారు. రాష్ట్రవ్యాప్త సమ్మెలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఈనెల 11 నుంచి సమ్మెకు సిద్ధమవుతున్న విషయం తెల్సిందే. అయితే సమ్మెలోకి వెళ్లవద్దని సీడీపీఓ పద్మశ్రీ ఆయా మండలాల అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను కార్యాలయానికి పిలిపించారు. వారితో చర్చించారు. సమ్మె నోటీసు అందించిన తాము విధులకు హాజరుకాలేమని టీచర్లు చెప్పారు. నోటీసులను వ్యక్తిగతంగా ఇవ్వాలని సీడీపీఓ తెలపగా.. అలాగే చేశారు. సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతుందని పలువురు ఉద్యోగులు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వీరికి సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వనజారాణి, నాయకులు కృష్ణకుమారి, బూడిద గణేశ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైంది



జ్యోతిప్రజ్వలన చేస్తున్న సీజీఎం పాండు

జ్యోతినగర్: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైందని ఎన్టీపీసీ చీఫ్ జనరల్ మేనేజర్ కేదార్‌రంజన్ పాండు అన్నారు. శనివారం పర్మనెంట్ టౌన్‌షిప్ సెయింట్ క్లేర్ హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేశారు. విద్యార్థులు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సూచించిన మార్గంలో ముందుకెళ్లాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు స్వయం పరిపాలన, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉపాధ్యాయులకు ఆటల పోటీలను నిర్వహించారు. దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు చిన్మయదాస్, ఏజీఎం(హెచ్‌ఆర్) బిజయ్‌కుమార్ సిగ్దర్, ఆదేశ్‌కుమార్‌పాండే, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

ఏకోదంత నమోనమః

సండే స్పెషల్

- మట్టి విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్న భక్తులు
- పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం
- జిల్లాకేంద్రంలో 47ఫీట్ల ఎత్తులో మట్టి విగ్రహం
- ఈసారి పంచముఖ గణపతి రూపంలో దర్శనం

పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతులను ప్రతిష్ఠించేందుకు మంటపాల నిర్వాహకులు సిద్ధమవుతున్నారు. ఎకో గణపతిని పూజించాలని కొన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకురావడంతోపాటు విగ్రహాలను తయారు చేయించి పంపిణీ చేస్తున్నాయి. దీంతో చాలామంది వీటివైపు దృష్టి సారిస్తున్నారు.



గతేడాది మట్టిగణపతికి పూజలు చేస్తున్న భక్తులు

47 ఏళ్లుగా గడ్డి వినాయకుడు

పెద్దపల్లి రూరల్:జిల్లాకేంద్రంలోని తెనుగువాడలో 47 ఏళ్లుగా గడ్డితో తయారుచేసిన వినాయకుడి భక్తులు పూజిస్తున్నారు. తెనుగువాడకు చెందిన పలువురు గడ్డి, బట్ట, వెదురుకర్రలతో గడ్డి వినాయకుడిని మండపంలోనే తయారుచేస్తారు. ఈ వినాయకుడి తొండం నుంచి నీరు వచ్చి భక్తులపై పడేలా ఏర్పాటు చేయడం ఈ గణపతి ప్రత్యేకత.



పర్యావరణ పరిరక్షణకు..



మా వాడలో నవరాత్రుల పాటు పూజలు చేసే గణేశుడిని కాలుష్యరహితంగా తయారు చేసుకుంటాం. రంగులు, పీఓపీ లేకుండా కేవలం గడ్డి, దుస్తులు, వెదురుకర్రలతోనే 47 ఏళ్లుగా వినాయకుడిని తయారుచేసి పూజిస్తున్నాం. కాలనీ పెద్దలు, యువకులు గణేశుడిని తీర్చిదిద్దుతారు. – కొలిపాక నర్సయ్య, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు



సిద్ధమవుతున్న 47 ఫీట్ల పంచముఖ గణపతి

జిల్లాకేంద్రంలో 47 ఫీట్ల గణపతి

పెద్దపల్లిరూరల్: ఖైరతాబాద్‌లోని భారీ గణేశుడి తర్వాత పెద్దపల్లిలో ఛత్రపతి యువసేన ఆధ్వర్యంలో మట్టితో తయారు చేసిన వినాయకుడిని నెలకొల్పుతున్నారు. ఈయేడాది పంచముఖ గణేశుడి రూపంలో ప్రతిమను తీర్చిదిద్దుతున్నారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో మహామండపాన్ని నిర్మించి.. జూలై 29న కర్రపూజ చేసి విగ్రహ ప్రతిష్ఠ పనులను ప్రారంభించారు. గతేడాది 45 ఫీట్ల ఎత్తు గణేశుడిని ప్రతిష్ఠించగా.. ఈసారి మరో రెండు ఫీట్లు పెంచి 47 ఫీట్ల ఎత్తు పంచముఖ గణేశుడిని ప్రతిష్ఠిస్తున్నారు.

ప్రకృతి సిద్ధంగా..



రాష్ట్రంలో ఖైరతాబాద్ గణేశుడి తర్వాతి స్థానం పెద్దపల్లికే దక్కింది. దాదాపు రూ.10లక్షల వ్యయంతో భారీ గణేశుడిని తీర్చిదిద్దుతున్నాం. మహామట్టిగణపతి నిర్మాణానికి గడ్డి, కర్రలు, వెదురు, జనపనార, చెరువు మట్టితోపాటు రాజస్థాన్ నుంచి ప్రత్యేకమైన మట్టిని తెప్పించాం. కోల్‌కత్తా నుంచి వచ్చిన కళాకారులతో పంచముఖ గణేశుడి విగ్రహతయారీ జరుగుతోంది.

– శివంగారి సతీష్, ఛత్రపతి యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు

ఉచితంగా మట్టి విగ్రహాలు

పర్యావరణ పరిరక్షణలో భాగంగా సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 14ఏళ్లుగా మట్టి వినాయకులను తయారు చేయించి ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ఏటా మట్టి గణపతి ప్రతిమలను తయారు చేయించిపంపిణీ చేస్తున్నారు.

పర్యావరణాన్ని కాపాడుదాం



ఆధ్యాత్మికతను పెంపొందించుకుంటూ పర్యావరణాన్ని కాపాడుకోవడానికి ప్రతిఒక్కరూ మట్టి వినాయకుడిని పూజించుకోవాలి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన విగ్రహాలతో పర్యావరణం కలుషితమవుతుంది.

– సీహెచ్.లింగమూర్తి, ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి



– యైటింక్లయిన్‌కాలనీ

త్రిశూల్ యూత్ ఆధ్వర్యంలో..



నాగరాజు

పర్యావరణ పరిరక్షణకు మేము సైతం అంటూ ఏటా మట్టి వినాయకుడి విగ్రహాలతో నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనికి చెందిన త్రిశూల్ యూత్ నిర్వాహకుడు పల్లికొండ నాగరాజు ఆధ్వర్యంలో ఈ ఏడాది 14 ఫీట్ల మట్టి వినాయకుడిని నెలకొల్పేందుకు మండపానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతిఒక్కరూ మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని కాపాడాలని ఆయన సూచించారు. వినాయకుడి మండపం ఆవరణలో సైతం అగ్ని ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక చర్యలను తీసుకుంటున్నామని తెలిపారు.

– జ్యోతినగర్



ప్రజల చెంతకే పాలన

- కొత్త జిల్లాల ఏర్పాటుతో చేరువైన సేవలు
- సంక్షేమ పథకాల అమలులో మనమే టాప్
- రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్



అదనపు ఇంజనీర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న కనకరత్నం, చిత్రంలో మంత్రి కొప్పుల, జెడ్పీ చైర్మన్ మధు

పెద్దపల్లిరూరల్: ప్రజల చెంతకే పాలన అందించాలనే ఆలోచనతో సీఎం కేసీఆర్ కొత్త జిల్లాలను ఏర్పాటు చేశారని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. జిల్లాకేంద్రంలో శనివారం జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ ఎస్‌ఈ కార్యాలయాన్ని జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్‌తో కలిసి ప్రారంభించారు. కార్యాలయం ఏర్పాటుతో జిల్లాలోని మూడు నియోజకవర్గాల ఇంజినీరింగ్ శాఖ అభివృద్ధి పనులపై పర్యవేక్షణ సులువవుతుందన్నారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఇతర రాష్ట్రాలు రాష్ట్రంలో అమలవుతున్న పథకాలను పరిశీలించేందుకు వస్తున్నాయని తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేసిన పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ కార్యాలయం సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్‌ఈ)గా కరీంనగర్ ఎస్‌ఈ కనకరత్నంకు అదనపు బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రఘువీర్‌సింగ్, ఈఈ గిరిశ్‌బాబు, డీఈఈలు శంకరయ్య, దేవేందర్, జనార్దన్, డీఏవో బ్రహ్మానందరెడ్డి, ఏఈ మదన్‌మోహన్ తోపాటు ఉపేందర్, పురుషోత్తం ఉన్నారు.

మంత్రికి ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల వినతి

నేషనల్ హెల్త్ మిషన్‌లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్న ఉద్యోగులు తమను పర్మినెంట్ చేయాలంటూ మంత్రి కొప్పుల, జెడ్పీచైర్మన్ పుట్టమధుకర్‌కు వినతిపత్రం అందించారు. తమ సమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూడాలని నాయకులు నరేశ్, శ్రావణ్, అంజికుమార్, విశ్రాంతి, సునీత కోరారు. అంతకు ముందు పట్టణంలో ఉద్యోగులు భిక్షాటన నిర్వహించారు.

బీఆర్‌ఎస్, బీజేపీని ఓడించాలి

- ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణకు కేంద్రం కుట్ర
- రాష్ట్రంలో మాఫియారాజ్యం కొనసాగుతోంది
- కాంగ్రెస్ ప్రచార కమిటీ కార్యనిర్వాహకుడు కోట శ్రీనివాస్



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ ప్రతినిధులు

సుల్తానాబాద్: రానున్న ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్‌ను ఓడిస్తేనే పేదలకు మేలు జరుగుతుందని కాంగ్రెస్ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యనిర్వాహకుడు కోట శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం ఆయన జిల్లాకు రాగా పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. మండల కేంద్రంలోని శాస్త్రీనగర్ నుంచి బైక్ ర్యాలీ చేపట్టారు. సుల్తానాబాద్‌కు చేరుకుని అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేసేందుకు బీజేపీ యత్నిస్తోందన్నారు. రాష్ట్రంలో సామాన్య, మధ్య తరగతి ప్రజలు బతుకులేని పరిస్థితి నెలకొందన్నారు. కులాలు, మతాలను విభజించే ఆలోచనకు వచ్చిన బీజేపీని నిలువరించాలన్నారు. పార్టీ టికెట్ ఎవరికి ఇచ్చినా కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. మాజీ సర్పంచులు ప్రకాశ్‌రావు, అన్నయ్యగౌడ్, రాజలింగం, తిరుపతి, నోముల శ్రీనివాస్‌రెడ్డి, ముస్త్యాల రవీందర్ పాల్గొన్నారు.

తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌నే గెలిపిద్దాం

పెద్దపల్లిరూరల్: తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పెద్దపల్లిలో ఆయన పార్టీ నాయకులు స్వాగతం పలికారు. మాఫియా పాలనను బొందపెట్టి పేదలకు మేలు చేసే కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవాలని కోరారు. నాయకులు సంపత్, సుభాష్‌రావు, సారయ్య, మస్రత్, సర్వర్, శ్రీనివాస్ తదితరులున్నారు.

రాజీమార్గమే రాచమార్గం



జిల్లాకోర్టు ఆవరణలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి హేమంత్‌కుమార్

- జిల్లావ్యాప్తంగా మెగా లోక్‌అదాలత్
- తప్పుడు సమాచారమిస్తే చట్టపరమైన చర్యలు
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి హేమంత్‌కుమార్



లోక్‌అదాలత్‌లో పాల్గొన్న కక్షిదారులు

పెద్దపల్లిరూరల్: కక్షిదారులు వారివారి కేసుల్లో రాజీపడడమే మేలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి హేమంత్‌కుమార్ అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన మెగాలోక్‌అదాలత్‌లో మాట్లాడారు. న్యాయస్థానాలకు తప్పుడు సమాచారమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. చిన్నచిన్న తగాదాలకే కోర్టుల వరకు వచ్చి వ్యయ, ప్రయాసలకు లోను కావొద్దన్నారు. శనివారం 9,415 కేసులు పరిష్కరించారు. రూ.49.42లక్షలు రికవరీ చేయించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లకిడి భాస్కర్, రెడ్డి శంకర్, హన్మాన్‌సింగ్, శంకర్, రమేశ్, శ్రీధర్ తదితరులున్నారు.

సుల్తానాబాద్‌లో 1,890 కేసులు పరిష్కారం

సుల్తానాబాద్: సుల్తానాబాద్ మున్సిఫ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి జీఎస్‌ఎల్. ప్రియాంక ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా లోక్‌అదాలత్‌లో 1,890 కేసులు పరిష్కారమయ్యాయి. న్యాయవాదులు చట్టాలపై కక్షదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భూసారపు బాలకిషన్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పెగడ శ్యాంసుందర్, ఏపీపీ శ్యాంప్రసాద్, సుల్తానాబాద్, జూలపల్లి ఎస్సైలు విజేందర్, వెంకటకృష్ణ, ఏజీపీ మేకల తిరుపతిరెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు పాల్గొన్నారు.

మంథనిలో 1475 కేసులు

మంథని: మంథని కోర్టు ఆవరణలో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో 1,475 కేసులు పరిష్కారమయ్యాయి. వివిధ కేసుల్లో రూ.6,80,400 జరిమానా విధించారు. అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి స్వాతిగౌడ్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రఘోత్తంరెడ్డి, ఏపీపీ ప్రణయ్, న్యాయవాదులు శశిభూషణ్ కాచే, భాస్కర్‌రెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు పరిష్కారం

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని కోర్టు ఆవరణలో క్రిమినల్ కేసులు 221, సివిల్ 3, ఎస్టీసీ 731, పెట్టీ కేసులు 3,646 కేసులను పరిష్కరించామని, రూ.26 లక్షలు బీమా సొమ్ము ఇప్పించామని జూనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్ తెలిపారు. ముందుగా గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి టి.శ్రీనివాసరావు, సీనియర్ సివిల్ జడ్జి టి.రాజ్‌కుమార్ మాట్లాడారు.

క్లుప్తంగా

మిత్రుడి కుటుంబానికి చేయూత


సాయమందిస్తున్న స్నేహితులు

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రానికి చెందిన వైద్యుల రమేశ్ ఇటీవల గుండెపోటుకు గురై చనిపోయారు. ఆయన ఇద్దరు కూతుళ్ల భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలని నిర్ణయించిన చిన్ననాటి మిత్రులు తలాకొంత పోగేసి రూ.2లక్షలు కూడబెట్టారు. ఇద్దరమ్మాయిలకు చెరో రూ.లక్ష చొప్పున డిపాజిట్ చేసి ఆ పత్రాలను శనివారం రమేశ్ కుటుంబానికి అందించారు. ఆత్మీయతను చాటుకున్న స్నేహితులను పలువురు అభినందించారు.

కారుణ్య నియామకపత్రాల అందజేత


నియామకపత్రాలు అందిస్తున్న జీఎం

గోదావరిఖని: ఆర్జీ–2 పరిధిలోని ఉద్యోగుల డిపెండెంట్లకు కారుణ్య నియామక పత్రాలను శనివారం జీఎం ఎల్వీ.సూర్యనారాయణ అందించారు. జీఎం కార్యాలయంలో ఐదుగురికి పోస్టింగ్ పత్రాలు అందించారు. నలుగురికి ఆర్జీ–2లో.. మరొకరికి మందమర్రి ఏరియాలో పోస్టింగ్ ఇచ్చారు. జీఎం మాట్లాడుతూ క్రమశిక్షణ, రక్షణతో విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షులు ఐలి శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ జి.రాజేంద్రప్రసాద్, డీవైపీఎం వంశీధర్, జీఎం ఆఫీసు పిట్ సెక్రెటరీ చిప్ప సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విష జ్వరంతో మహిళ మృతి


రాధ(ఫైల్)


ముత్తారం: మండలంలోని మచ్చుపేటకు చెందిన పందిళ్ల రాధ (36) విషజ్వరంతో శుక్రవారం రాత్రి మృతి చెందింది. జ్వరంతోపాటు రక్తకణాలు తగ్గిపోవడంతో ఆమెను మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. రాధకు భర్త రవి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

బస్సు కింద పడి వ్యక్తి ఆత్మహత్య?




పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి బస్ స్టాండ్ సమీపంలో ఓ ఆర్టీసీ బస్సు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి (36) అక్కడికక్కడే మృతి చెందాడు. సదరు వ్యక్తి ఆత్మహత్య చేసుకోవాలనే ఉద్దేశంతోనే బస్సుకింద పడి ఉండొచ్చని, అంతకుముందు బస్టాండ్ ప్రాంతంలోనే తిరుగుతూ బస్సు కింద పడేందుకు యత్నించాడని స్థానికులు చెబుతున్నారు. మృతుడిది మధ్యప్రదేశ్ రాష్ట్రంగా అనుమానిస్తున్నామని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై మహేందర్ తెలిపారు.

పల్లెచిత్రాల 'తోట'



- వేలం పాటలో కోటిన్నర పలికిన పైనం
- ఆకట్టుకుంటున్న బూర్గుపల్లి వైకుంఠం కళాఖండాలు
- ఎన్నో అవార్డులు.. మరెన్నో పురస్కాలు

వైకుంఠం గీసిన చిత్రాలకు క్రేజీ


చిత్రం గీస్తున్న వైకుంఠం

బోయినపల్లి(చొప్పదండి): పల్లె జీవనం.. పడచుల కట్టు బొట్టు.. భారతీయ సంస్కృతి.. ఆయన చిత్రాలకు మూలాధారం. తోట వైకుంఠం కుంచె పడితే చిత్రాలకు జీవం వచ్చి, కాన్వాస్‌పై నాట్యం చేస్తాయి. రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం బూర్గుపల్లిలో జన్మించిన వైకుంఠం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నాడు. ఏడేళ్ల క్రితం గీసిన చిత్రానికి ఇటీవల ముంబయిలోని ఆస్తాగురు యాక్షన్ హౌస్ నిర్వహించిన వేలంలో రూ.1,41,35,220 ధర పలకడం విశేషం.

బూర్గుపల్లిలో విద్యాభ్యాసం

బూర్గుపల్లిలో 1942లో జన్మించిన తోట వైకుంఠం స్వగ్రామంలోనే ప్రాథమిక విద్య పూర్తి చేశారు. బోయినపల్లి, శాత్రాజ్‌పల్లి, వేములవాడ, సిరి సిల్లలో ఉన్నత విద్య చదివారు. హైదరాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో చిత్రలేఖనం పూర్తి చేశా రు. అనంతరం మహారాజ సయాజీరావు యూనివర్సిటీ ఆఫ్ బరోడాలో ప్రముఖ చిత్రకళా కారుడు సుబ్రమణియన్ దగ్గర శిష్యరికం చేశారు.

రంగుల ఆయన ప్రత్యేకత

డస్కీస్కిన్‌తో మహిళల చిత్రాలు గీయడం ఆయన ప్రత్యేకత. సాదాగా కనిపించే మహిళలు రూపం ఆయన చిత్రంగా మలిస్తే అందంగా కనిపిస్తారు. ఆయన గీసిన అందమైన మహిళల చిత్రాలను సిరిసిల్ల చీరెలుగా అభివర్ణిస్తారు.

అమ్మ.. మహిళలే స్ఫూర్తి

చిత్రకారుడిగా గుర్తింపు పొందడానికి అమ్మ స్ఫూర్తి అని వైకుంఠం చెబుతుంటారు. చిన్నప్పుడు గ్రామంలో చిందు కళాకారులు నాటకాలు ప్రదర్శిస్తుంటే వారు వేసిన వేశాలకు తగినట్లుగా మేకప్ వేసి రంగులు దిద్దే అలవాటు ఉండేదని తెలిపారు. అలా చిన్నప్పటి నుంచే రంగులు, బొమ్మలు గీయడంపై అనురక్తి కల్గిందని చెబుతుంటారు. ఎరుపు, ఆకుపచ్చ, నీలం రంగులు తనకు ఇష్టమని.. తన చిత్రాలలోనూ ఎక్కువగా వాటినే వాడుతానని తెలిపారు.

ఎన్నో అవార్డులు

భోపాల్‌లో రెండేళ్లకోసారి ఇచ్చే భారత్ భవన్ అవార్డుతోపాటు భారత ప్రభుత్వం అందించే జాతీయ అవార్డు, ఉమ్మడి రాష్ట్రంలో హంస అవార్డు అందుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉత్తమ చిత్రకళాకారుడిగా అవార్డు లభించింది. దాసి, మాభూమి చిత్రాలకు ఆర్ట్ డైరెక్టర్‌గా పనిశారు. దాసి చిత్రానికి ఉత్తమ ఆర్ట్ డైరెక్టర్‌గా జాతీయ అవార్డు అందుకున్నారు.

వైకుంఠంపై పలు డాక్యుమెంటరీలు

వైకుంఠంపై పలు డాక్యుమెంటరీలు వచ్చాయి. 2015లో కోల్‌కతాకు చెందిన పార్థురాయ్ డాక్యుమెంటరీ నిర్మించారు.

గ్రామాభివృద్ధికి విరాళాలు

స్వగ్రామం బూర్గుపల్లిలో పాఠశాల అభివృద్ధికి రూ.40 వేలు విరాళంగా అందించారు. యువత చదువుకుంటేనే మంచి భవిష్యత్ ఉంటుందని తెలుపుతున్నారు.

మాకు గర్వంగా ఉంది



అంతర్జాతీయ చిత్రాకారుడిగా పేరు పొందిన తోట వైకుంఠం మా గ్రామస్తుడని చెప్పుకోవడం గర్వంగా ఉంది. ఆయనతో మా గ్రామానికి పేరు రావడం గొప్పగా భావిస్తున్నాం. ముంబయిలో జరిగిన వేలంలో ఆయన గీసిన చిత్రానికి కోటిన్నర పలకడం చాలా సంతోషంగా ఉంది.
– కమటం అంజయ్య,మాజీ సర్పంచ్, బూర్గుపల్లి

చిందు నాటకాలు ఇష్టపడేవారు



వైకుంఠం సారు చిన్నప్పుడు మా గ్రామంలో చిందునాటకాలు వేసేవారు. పదేళ్ల కింద గ్రామానికి వచ్చినప్పుడు పాతతరం చిందు కళాకారులతో వేశాలు వేయించి డాక్యుమెంటరీ తీశారు. చిందుకళను ఇష్టపడేవారు.
– గజ్జెల సాయిలు,చిందు కళాకారుడు

గ్రామాభివృద్ధికి తోడ్పాటు



తోట వైకుంఠం గ్రామంలో యువతకు స్ఫూర్తినిచ్చే వ్యక్తి. స్వగ్రామంలోని పాఠశాల అభివృద్ధికి గతంలో రూ.40 వేలు సాయం చేశారు. ఆయన గీసిన చిత్రాలతో మా ఊరికి పేరు రావడం గర్వంగా ఉంది.
– పెరుక మహేశ్, యువకుడు

బొగ్గుబాయి వార్తలు

ప్రభావిత గ్రామాల్లో సంక్షేమంపై దృష్టి

- ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్


మ్యాప్ పరిశీలిస్తున్న అధికారులు

గోదావరిఖని: ప్రభావిత గ్రామాల్లో సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి సారించినట్లు ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, కార్పొరేట్ ఎన్విరాన్‌మెంట్ జీఎం జీవీఎల్.గణపతి అన్నారు. శనివారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో పర్యావరణ రెమిడేషన్ ప్లాన్స్‌పై చర్చించారు. ప్రభావిత గ్రామాల్లో చేపట్టాల్సిన సీసీ రోడ్లు, పాఠశాల భవనాల మరమ్మతు, టాయిలెట్ నిర్మాణం పనులు, సోలార్ వీధిదీపాలు, మొక్కల పెంపకం తదితర అంశాలపై చర్చించారు. అనంతరం మేడిపల్లి ఓసీపీలో నడుస్తున్న సాండ్ ప్లాంట్‌ను సందర్శించారు. ఓవర్ బర్డెన్ మట్టి నుంచి ఇసుక వెలికితీత పనులను పరిశీలించారు. మేడిపల్లి ఓపెన్ కాస్ట్ ముగింపు తర్వాత పర్యావరణ పరిరక్షణకు చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. మైన్‌క్లోజర్ సమయంలో చేపట్టాల్సిన పర్యావరణ రేమిడేషన్ ప్లాన్స్ మ్యాపులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏజెంట్ బానోతు సైదులు, ఎన్విరాన్ మెంట్ అధికారి ఆంజనేయప్రసాద్, సర్వే అధికారి ప్రభాకర్, మేనేజర్ మల్లికార్జున్ యాదవ్, అడిషనల్ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆత్మస్థైర్యం దెబ్బతీయొద్దు


సర్క్యులర్ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

గోదావరిఖని: సంస్థ అభివృద్ధికి అహర్నిశలు పాటుపడే ఉద్యోగుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా యాజమాన్యం వ్యవహరిస్తోందని మైనింగ్ టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ కన్వీనర్ మాదాసి రామమూర్తి అన్నారు. సింగరేణి గని వృత్తి శిక్షణ కేంద్రాల్లో విరమణ చేసిన ఉద్యోగులను కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసే అవకాశాన్ని కల్పిస్తూ జారీ చేసిన సర్క్యులర్‌ను శనివారం ఓసీపీ–3పై దహనం చేశారు. వార్షిక ఉత్పత్తి లక్ష్యసాధన, ఉద్యోగుల రక్షణకు ప్రాణాలు పణంగా పెట్టి పనిచేసే సూపర్‌వైజర్లకు గౌరవం లేకుండా చేయడం శోచనీయమని అన్నారు. భూగర్భం, ఓపెన్‌కాస్టులలో పనిచేసే ఉద్యోగులు, అధికారులు సంబంధిత విధులు నిర్వహించలేని పరిస్థితులలో వారికి వృత్తి శిక్షణ కేంద్రంలో పనిచేసే అవకాశం ఉండేదని, దానిని కొంతమంది వ్యక్తుల కోసం కాంట్రాక్టు విధానాన్ని ప్రవేశపెట్టడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో మైనింగ్ స్టాఫ్ అసోసియేషన్ నాయకులు అనిల్ కుమార్, గణేష్, సమ్మయ్య, శ్రీకాంత్, జి. రాజన్న, మదన్‌మోహన్, సురేష్, కృష్ణ, సదన్న తదితరులు పాల్గొన్నారు.

సిమ్‌టార్స్‌లో ప్రథమ చికిత్స దినోత్సవం


కేక్‌కట్ చేస్తున్న ఏరియా సేఫ్టీ జీఎం సాంబయ్య

గోదావరిఖని: ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవాన్ని శనివారం ఆర్జీ–2 ఏరియాలోని సిమ్‌టార్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రామగుండం రీజియన్ సేఫ్టీ జీఎం సాంబయ్య కేక్‌కట్ చేశారు. అనంతరం మాట్లాడుతూ అత్యవసర పరిస్థితులలో గాయపడ్డ కార్మికులకు చికిత్స అందించేందుకు ప్రతిఒక్కరూ శిక్షణ తీసుకోవాలన్నారు. సింగరేణిలో అన్ని శాఖల ఉద్యోగులు ఫస్ట్‌ఎయిడ్‌లో శిక్షణ పొందాలని సూచించారు. ఇప్పటివరకు 47 బ్యాచ్‌లకు సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ అందించామన్నారు. కార్యక్రమంలో రెస్క్యూ డిప్యూటీ మేనేజర్ భాస్కర్ రెడ్డి, డాక్టర్ రమేశ్ బాబు, డీజీఎం హుస్సేన్, లోక్‌నాథ్‌రెడ్డి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మావో ఆలోచనతో ముందుకెళ్దాం


చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

గోదావరిఖని: మావో ఆలోచన స్ఫూర్తితో ప్రజా ఉద్యమాన్ని నిర్మిద్దామని సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి కె.రాజన్న పిలుపునిచ్చారు. మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కామ్రేడ్ మావో సేటు 47వ వర్ధంతిని నిర్వహించారు. 50ఏళ్లకు పైగా శ్రీకాకుళం, గోదావరిలోయ ప్రజాప్రతిఘటన పోరాటాలు నిర్మించి ప్రజాఉద్యమాన్ని నేటికీ కొనసాగిస్తున్నామని, పాలకులు ఎంత అణిచివేసినా రాబోయే రోజుల్లో విప్లవం విజయవంతమై తీరుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఐ.కృష్ణ, ఇ.నరేష్, ఎం.దుర్గయ్య, కే.జ్యోతి, కళ్యాణి, రవికుమార్, తిప్పని రామ్ తదితరులు పాల్గొన్నారు.

మావోసేటుకు నివాళి

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో శనివారం సీపీఐ, ఎంఎల్ న్యూడెమోక్రసి మంథని కమిటీ ఆధ్వర్యంలో మావోసేటు 47వ వర్ధంతిని నిర్వహించారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు వెంకన్న, బి.అశోక్, బుచ్చమ్మ, పద్మ, కాంతయ్య, సుగుణ, రమ, శంకర్, రాజనర్సు, లింగయ్య, ప్రేమ్‌కుమార్, గట్టయ్య, మధునమ్మ, రాజేశ్వరి, స్వామి, కళావతి, ప్రకాష్, రజిత, రాణి, లక్ష్మీ, రాయమల్లు పాల్గొన్నారు.

ఒడ్డెర కులస్తులకు న్యాయం చేయండి


మంత్రికి వినతిపత్రం అందిస్తున్న జెడ్పీ చైర్మన్

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం వెంకట్రావుపల్లిలోని ఒడ్డెర కులస్తులకు న్యాయం చేయాలని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు నాయకులు, ఒడ్డెరులతో కలిసి పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్‌కు శనివారం వినతిపత్రం అందించారు. గ్రామంలో 45 నుంచి 50 ఒడ్డెర, రజక కుటుంబాలు నివాసముంటున్నాయని, వీరంతా బీసీలకు ఆర్థికసాయం పథకానికి దరఖాస్తు చేసుకున్నారని, అధికారులు సరిగ్గా విచారణ చేయకుండానే అనర్హులగా గుర్తించారని పేర్కొన్నారు. వీరికి రూ.లక్ష చొప్పున అందించాలన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, నాయకులు కుమార్, నాయకులు బుర్ర ముత్యాల గౌడ్, కిరణ్, వడ్డెర, రజక కులస్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీ విలీనం బిల్లును గవర్నర్ ఆమోదించాలి


డాక్టర్ నగేశ్

జూలపల్లి: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ జారీ చేసిన బిల్లును గవర్నర్ ఆమోదించాలని వైఎస్సార్ టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నగేశ్ తెలిపారు. శనివారం మాట్లాడుతూ 44 వేల కుటుంబాల భవిష్యత్‌కు సంబంధించిన బిల్లును ఆమోదించాలన్నారు. బిల్లు ఆలస్యంతో 180 మంది కార్మికులు రిటైర్డ్ ఆయినవారికి అన్యాయం జరిగిందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైతే విలీన ప్రక్రియ ఆగిపోయే అవకాశం ఉందని, వెంటనే ఆమోదించి కార్మికులను న్యాయం చేయాలని కోరారు.

21న వేతన బకాయిలు చెల్లింపు

గోదావరిఖని: సింగరేణి కార్మికుల 11వ వేజ్‌బోర్డు 23నెలల బకాయిలను ఈనెల 21న చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించినట్లు టీబీజీకేఎస్ అధ్యక్షుడు బి.వెంకట్రావ్ తెలిపారు. యూనియన్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్, డైరెక్టర్(పా)తో చర్చించారని, ఈ మేరకు అంగీకారం కుదిరిందని పేర్కొన్నారు. ఇది టీబీజీకేఎస్ విజయంగా తెలిపారు.

హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

గోదావరిఖని: ఈనెల 17న కొత్తగూడెంలో నిర్వహించే మోటార్ మెకానిక్ ట్రెయినీ పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లు వెబ్‌సైట్‌లో ఉంచినట్లు పర్సనల్ జీఎం కె.బసవయ్య తెలిపారు. 2017లో వెలువడిన నోటిఫికేషన్‌కు ఈనెల 17న పరీక్ష నిర్వహిస్తున్నట్లు వివరించారు. మధ్యాహ్నం రెండు నుంచి 3.30గంటల వరకు కొత్తగూడెం సింగరేణి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో పరీక్ష ఉంటుందని, అభ్యర్థుల మొబైల్ నంబర్లకు సమాచారం అందించామని పేర్కొన్నారు.

ఓడెడ్ వంతెనకు గ్రహణం

- ఏడేళ్లు గడిచినా పూర్తికాని పనులు
- అధికారులు, పాలకుల నిర్లక్ష్యం
- వంతెన పూర్తయితే తగ్గనున్న దూరభారం
- ఉమ్మడి కరీంనగర్, వరంగల్‌వాసులకు మేలు


పిల్లర్ల స్థాయిలోనే వంతెన

ముత్తారం: ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాలకు రవాణా సౌకర్యం కల్పించేలా.. దూరభారం తగ్గేలా చేపట్టిన వంతెన నిర్మాణానికి నిర్లక్ష్యపు గ్రహణం పట్టుకుంది. అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో ఏడేళ్లు గడుస్తున్నా.. పిల్లర్ల దశ దాటడంలేదు. వంతెనతో మూడు జిల్లాలకు దూరభారం తగ్గుతుందనుకున్న ప్రజల ఆశలు నెరవేరడం లేదు. పాలకుల నిర్లక్ష్యంతోనే కాంట్రక్టర్లు వంతెన నిర్మాణం పనులను జాప్యం చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని ఓడెడ్, జయశంకర్‌భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లి వద్ద మానేరు వాగుపై వంతెన నిర్మాణానికి రూ.47.7 కోట్లు మంజూరు కాగా.. 2016 ఆగస్టు 4న అప్పటి రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, అప్పటి మంథని ఎమ్మెల్యే.. ప్రస్తుత జెడ్పీ చైర్మన్ పుట్ట మధు శంకుస్థాపన చేశారు. అయితే ఇప్పటివరకు వంతెన పనులు పూర్తికాకపోవడంతో రెండు జిల్లాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

ఏడేళ్లు గడిచినా పిల్లర్లలోనే..

ఓడెడ్‌మానేరు వంతెన నిర్మాణం చేపట్టి ఏడేళ్లు గడిచాయి. అయినా పనులు మాత్రం పిల్లర్లను దాటలేదు. వంతెన నిర్మాణాన్ని దక్కించుకున్న కాంట్రాక్టర్ గడువు పొడిగించుకున్నా.. జాప్యమవుతోంది. ఏడేళ్లలో కనీసం 60శాతం పనులు కూడా పూర్తికాకపోవడానికి పాలకులు, అధికారుల నిర్లక్ష్యమే కారణమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లర్ల దశకే ఏడేళ్లు పడితే పనులు పూర్తికావడానికి ఇంకెన్నాళ్లు పడుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


ముళ్లపొదల మధ్య శిలాఫలకం

దూరభారం తగ్గుతుంది

వంతెన నిర్మాణం పూర్తయితే ఉమ్మడి వరంగల్ జిల్లాకు వెళ్లడానికి సుమారు 50 నుంచి 60 కిలోమీటర్ల దూరభారం తగ్గుతుంది. మంథని నియోజకవర్గంలో పండించే పత్తి, మిరప రైతులు వరంగల్ మార్కెట్‌కు వెళ్లడానికి ఈ మార్గం అనుకూలం. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాలకు సింగరేణి కార్మికులు, రైతులు, వ్యాపారుల రాకపోకలకు ఈ వంతెన దూరభారం తగ్గిస్తుంది. ఓడెడ్ గ్రామానికి చెందిన రైతుల భూములు, తాటివనం మానేరు అవతల ఉన్నాయి. వర్షకాలంలో మానేరు ఉధృతంగా ప్రవహిస్తే రాకపోకలు నిలిచిపోతాయి. అత్యవసరమైన వారు సుమారు 60 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. గీతకార్మికులు ప్రాణాలు క్యాన్ల సాయంతో ఈదుతూ మానేరు దాటుతారు. వంతెన నిర్మాణం పూర్తయితే వీరందరికీ మేలు జరుగుతుంది.

వేసవిలో తాత్కాలిక మట్టిరోడ్డు

ఏళ్లు గడిచినా వంతెన నిర్మాణం పూర్తికాకపోవడంతో వేసవిలో ఓడెడ్, గర్మిళ్లపల్లి గ్రామస్తులు తాత్కాలిక మట్టి రోడ్డు ఏర్పాటు చేస్తారు. దారిమీదుగా వెళ్లేవారి నుంచి టోల్‌టాక్స్ వసూలు చేస్తారు. ఈ క్రమంలో ఓడెడ్ వంతెన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసేలా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన బాబర్ సలీంపాషా


కేటీఆర్‌తో బాబర్ సలీంపాషా

జ్యోతినగర్: రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌ను ఐఎన్టీయూసీ జాతీయ సీనియర్ నాయకుడు బాబర్ సలీంపాషా శనివారం హైదరాబాద్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా బాబర్‌ను కేటీఆర్ శాలువాతో సత్కరించారు. రామగుండం ప్రాంతంలోని పలు అంశాలపై ఇరువురు చర్చించారు. ముస్లింలను ఆదుకోవాలని, ఖబ్రస్తాన్‌ల ప్రహరీలకు నిధులు విడుదల చేయాలని కోరినట్లు బాబర్ తెలిపారు.

బీఆర్ఎస్‌లో చేరుతారా..?

మంత్రి కేటీఆర్‌ను బాబర్ కలవడంపై స్థానికంగా పలు చర్చలకు దారితీస్తోంది. బాబర్ బీఆర్ఎస్‌లో చేరేందుకే కేటీఆర్‌ను కలిశారని చెప్పుకుంటున్నారు. బీఆర్ఎస్ జాతీయ పార్టీగా అవతరించిన విషయం తెల్సిందే. ఐఎన్టీయూసీలో బాబర్ జాతీయస్థాయి నేతగా ఉన్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్‌లో చేరితో బీఆర్ఎస్ జాతీయస్థాయి కార్మిక సంఘం నాయకత్వ బాధ్యతలు అప్పగించవచ్చనే చర్చ జోరుగా నడుస్తోంది. ఈ విషయమై బాబర్‌ను సంప్రదించగా రామగుండం ప్రాంత ముస్లింల అభివృద్ధికే కేటీఆర్‌ను కలిశానని తెలిపారు.

ఎల్లంపల్లిని సందర్శించిన హైకోర్టు ఏజీపీ


ప్రాజెక్టును సందర్శిస్తున్న ఏజీపీ రమేశ్

రామగుండం/గోదావరిఖనిటౌన్: హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ పెనుబల్లి రమేశ్‌బాబు శనివారం రామగుండంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం అంకంపాలెంకు చెందిన రమేశ్ బాబు హైకోర్టులో ఏజీపీగా ఉద్యోగం సాధించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి గోలివాడ పంపుహౌస్‌ను సందర్శించారు.

రమేశ్‌కు సన్మానం

గోదావరిఖనిటౌన్: మొదటిసారి గోదావరిఖనికి వచ్చిన రమేశ్‌ను ఖని న్యాయవాదులు కాంపెల్లి చంద్రశేఖర్, పెండ్యాల మహేష్, గాలిపెల్లి శ్రావణ్ శాలువాలతో సన్మానించారు. తనకు అవకాశమిచ్చిన రాష్ట్ర ప్రభుత్వం, న్యాయమూర్తులకు రుణపడి ఉంటానని రమేశ్ తెలిపారు.

కుక్కలదాడిలో విద్యార్థికి గాయాలు


గాయపడిన సాయికుమార్

ఓదెల: మండలంలోని పొత్కపల్లికి చెందిన విద్యార్థి సిలివేరి సాయికుమార్‌పై శుక్రవారం సాయంత్రం కుక్కలు దాడిచేశాయి. స్థానికుల కథనం ప్రకారం.. సాయికుమార్ కిరాణం దుకాణానికి వెళ్లి ఇంటికొస్తుండగా ఆరు కుక్కలు వెంటపడి కరిచాయి. స్థానికులు గమనించి వాటిని తరిమికొట్టారు. ఘటనలో బాలుడి చేతులు, వీపు, ముక్కు, పొట్టపై గాయాలయ్యాయి. అతడిని 108లో కరీంనగర్ తరలించి చికిత్స అందించినట్లు తండ్రి రాజేందర్ పేర్కొన్నారు.